తెయూలో మహిళా సిబ్బందిపై వేధింపులు 2





క్యూలో చెప్పులు.. అన్నదాత 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## సొసైటీల్లో పుష్కలంగా యూరియా నిల్వలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాకు కేటాయించబడ్డాయన్నారు. అన్ని సొసైటీలకు ఎరువులను చేరవేస్తూ, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో లక్షా 39వేల మంది రైతులకు బుకింగ్ యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా 3.78 లక్షల బస్తాల యూరియా ఎరువు పంపిణీ జరిగిందని వెల్లడించారు. ఒక్కో ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు.


16-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## పిప్రి మరో బెంగాల్ అవుతుంది.. ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

**అక్షరటుడే, ఆర్మూర్:** హిందువులంతా ఏకం కాకపోతే పిప్రి మరో బెంగాల్ అవుతుందని ఎంపీ అర్వింద్ అన్నారు. అప్పు ఇచ్చి అడిగినందుకు పిప్రిలో ఓ వ్యక్తి ఇంటికి నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎంపీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన వంతుగా రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదివేల హిందూ కుటుంబాలు ఉన్న పిప్రిలో ఐక్యంగా లేకపోతే ఎలా అని వ్యాఖ్యానించారు. ఓ వర్గం వ్యక్తి ఏకంగా ఇంట్లోకి దూరి అందరిపై పెట్రోల్ చల్లి నిప్పు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రూ.25 లక్షల నష్టం జరిగితే రూ.13 లక్షలు ఎలా ఇప్పిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులంతా ఐక్యంగా లేకపోతే పిప్రి మరో బెంగాల్ అవుతుందని హెచ్చరించారు. ఆయన వెంట పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ నాయకులు ఉన్నారు.

కామారెడ్డి కాంగ్రెస్ రాజకీయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. వరుస పరిణామాలను పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్గాలుగా విడిపోయి విమర్శలు చేసుకోవడంతో కామారెడ్డిలో పార్టీ పరిస్థితి పలుచనగా మారుతోంది. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, మంత్రిగా చేసి ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్న షబ్బీర్ అలీని చుట్టూ జరుగుతున్న పరిణామాలు నాయకులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఇటీవల ఆయన షోకాజ్ నోటీసులు రావడం కూడా చర్చకు దారితీసింది.

- అక్షరటుడే, కామారెడ్డి



# కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..!

■ 'షబ్బీర్ అలీ' ఆడియో రిలీజ్ వెనక ఉన్నదెవరు? ■ పోలీసులకు పోటాపోటీ ఫిర్యాదులు
■ అయోమయంలో కార్యకర్తలు ■ నిజానిజాలు వెలుగులోకి వచ్చేనా!

షబ్బీర్ అలీ ఓ కార్యకర్తతో మాట్లాడినట్టు చెబుతున్న ఆడియో బయటకు రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అయితే అది ఫేక్ అని, తన గొంతును మిమిక్రీ చేసి కుట్రపూరితంగా సృష్టించారని షబ్బీర్ అలీ స్వయంగా ఖండించారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో నిజాయితీకి మారుపేరుగా నిలిచానని, ఇలాంటి నీచపు ఎత్తుగడలకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికి ఉందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### తీవ్ర చర్చ..


అంచలంచెలుగా ఎదిగి ఢిల్లీ స్థాయిలో పేరు సంపాదించిన షబ్బీర్ అలీ లాంటి కీలక నేతపై ప్రస్తుతం వస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. ఓ కార్యకర్తతో మాట్లాడిన ఆడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారగా అసలు ఆ ఆడియో నిజమేనా..? ఒకవేళ నిజం కాకపోతే దానిని బయటకు ఎవరు వైరల్ చేశారు..? దీని వెనుక ఉన్నదెవరు అనే చర్చ పొలిటికల్ వర్గాల్లో కొనసాగుతోంది. తెరవెనుక ఉంటూ షబ్బీర్ ఆలీపై కుట్ర చేసేంత సాహసం ఎవరు చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది.

### పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన వివాదం

ఈ ఆడియో వ్యవహారం కామారెడ్డి జిల్లా రాజకీయాలను ఒక్కసారిగా కుదిపేసింది. ఈ పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని షబ్బీర్ అలీ వర్గీయులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మరోవైపు ప్రత్యర్థి వర్గం కూడా పోటాపోటీగా ఫిర్యాదులు ఇవ్వడంతో కామారెడ్డి కాంగ్రెస్‌లో గందరగోళం నెలకొంది. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియని అయోమయంలో ముఖ్య నాయకులు పడ్డారు.

### పార్టీ పెద్దల నిర్ణయంపై ఉత్కంఠ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కామారెడ్డి లాంటి కీలక నియోజకవర్గంలో ఇలాంటి వివాదాలు పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. సీనియర్ నేతపై జరుగుతున్న దుష్ప్రచారానికి పార్టీ అధిష్ఠానం ఎలా పుల్‌స్టాప్ పెడుతుందోనని కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. షబ్బీర్ అలీకి అండగా నిలిచి, కుట్రదారులను బయటకు లాగుతారా లేక వివాదం మరింత ముదరనిస్తారా అనేది వేచి చూడాలి. ఆడియో విషయంలో ఫోరెన్సిక్ టెస్టుకు పంపాలని వస్తున్న డిమాండ్ నేపథ్యంలో నిజానిజాలు తేల్చి, పార్టీ ప్రతిష్ఠను కాపాడే బాధ్యత అధిష్ఠానంపైనే ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇద్దరు ముఖ్య నేతల మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం పార్టీకి అంత మంచిది కాదని పొలిటికల్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు.



## రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నియోజకవర్గంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తదితరులతో నిర్వహించిన వెబ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి అధికార దృష్టికి తీసుకెళ్లారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతుల సమస్యలపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ స్పందించారు. ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో యూరియా ఎరువుల సరఫరా, రైతులకు ఎరువుల అందుబాటుపై ప్రధానంగా ప్రస్తావించారు. చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.

## ఎంపీ అర్వింద్ నోరు అదుపులో పెట్టుకోవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** సీఎం, మంత్రుల గురించి మాట్లాడేటప్పుడు ఎంపీ అర్వింద్ నోరు అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా సీఎం, మంత్రులపై ఎంపీ అర్వింద్ ఆరోపణలు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు ఎలాంటి స్కామ్‌లు లేవని.. అలాంటిది సీఎం, మంత్రులను ఉద్దేశిస్తూ 'మీకు పుట్టగతులు ఉండవు' అని ఎంపీ మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన 'నీట్' పరీక్ష స్కామ్‌పై ఎంపీ ఎందుకు మాట్లాడలేదని మానాల ప్రశ్నించారు. ఈ స్కాంలో బీజేపీకి సంబంధించిన ముఖ్య నాయకుల అనుచరులే ఉన్నారని.. దీనికి ఎంపీ ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.



## మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి: అదనపు డీసీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేకంగా ప్రాధాన్యత నివ్వాలని అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్ పేర్కొన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భరోసా సెంటర్, న్యాయశాఖ, చైల్డ్ వెల్ఫేర్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కార్యక్రమాన్ని సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలో మహిళలు చిన్నారుల రక్షణకు సంక్షేమానికి అన్ని శాఖలు సమన్వయంగా కృషి చేయాలని శుభం ప్రకాష్ అన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు బాధితులకు సత్వర న్యాయ సహాయం అందే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందేలా భరోసా సెంటర్ పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీసీఆర్బీ సీఐ పాండేరావు, ఎస్సై వర ప్రసాద్ రెడ్డి, పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి పీపీ నరసింహారెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ శోభారాణి, జిల్లా ప్రొఫెషనల్ ఆఫీసర్ పవన్ కళ్యాణ్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ జోత్స్న, సర్వేలైన్ ఇన్‌ఛార్జి డాక్టర్ వెంకటేష్, డీసీపీవో చైతన్య, భరోసా సెంటర్ ఇన్‌ఛార్జి మహిళా ఎస్సై పుష్పవతి, భరోసా సెంటర్ ప్రతినిధి రోజా తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ :** ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. పాఠశాలలో సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసిన కలెక్టర్ అనంతరం కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాల్‌లను పరిశీలించి సదుపాయాలను గమనించారు. పుస్తకాలు, నోట్ బుక్కులు పూర్తిస్థాయిలో వచ్చాయా అని ఆరా తీశారు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలతో పాటు కిచెన్, డైనింగ్ హాల్‌లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు వస్తేనే వారితో పంపాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు పాఠశాలకు హాజరు కాని విద్యార్థినులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వారు ఎందుకు పాఠశాలకు రావడం లేదనే విషయాన్ని ఆరా తీయాలన్నారు. పాఠశాలలో పెండింగ్ పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ పనులను తక్షణమే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సెకండియర్ క్లాస్ రూమ్‌కు వెళ్లి విద్యార్థినులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేస్తూ, సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందజేశారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ స్వప్న, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



## నేర చరిత్ర కలిగిన వారిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** నేర చరిత్ర కలిగిన వారిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఆయన భిక్కనూరు పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పని తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై రోల్ కాల్ ప్రాముఖ్యత, విధులు, బాధ్యతలపై పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన ఆర్థిక నేరాలు, దొంగతనాలు, ఇతర కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో ప్రత్యేక కార్యాచరణతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయాలని, పగలు, రాత్రి గస్తీని పెంచాలని సూచించారు. వాహనాల తనిఖీలు, నాకాబందీలు నిర్వహిస్తూ అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత అంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భిక్కనూరు ఎస్‌హెచ్‌వోకు సూచించారు. గ్రామాలు, కాలనీల్లో ప్రజలతో మమేకమవుతూ పోలీసులపై విశ్వాసం పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని చెప్పారు.

## రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీపై ఆరోపణలు



**అక్షరటుడే, ఆర్మూర్ :** రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రేవంత్ రెడ్డి ఐఆర్ఎఫ్‌సీపై డ్రామా ప్రారంభించారని ఆరోపించారు. ఏమీ చేయలేని స్థితిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తూ తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన అన్నారు. ప్రైవేట్ సంస్థ తెచ్చుకున్న వాణిజ్య రుణాలను కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రైల్వే శాఖ నిధులు ఇస్తుందని రేవంత్ రెడ్డికి ఎవరు చెప్పారో ఏ ఆర్థిక శాస్త్రంలో చదివారో తెలపాలని ప్రశ్నించారు. భూసేకరణలో రాష్ట్ర వాటా చూపించే సత్తా లేని అసమర్థత రాష్ట్ర ప్రభుత్వానిదని దుయ్యబట్టారు. ఎన్నికల్లో వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మెట్రో ఫేజ్-2 కడతామని చెప్పి అబద్ధాల హామీలతో గద్దెనెక్కి ప్రస్తుతం రేవంత్‌రెడ్డి చేతులు దులుపుకున్నారన్నారు. మెట్రో తొలిదశలో మోదీ ప్రభుత్వం నిధులు ఇచ్చిందని కేసీఆర్ పాపాల వల్ల మెట్రో నష్టపోతే దాన్ని బాగు చేయాల్సింది పోయి పక్క రాష్ట్రాల ప్రభుత్వాల మీద పడి సీఎం ఏడుస్తున్నారని విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారనడం దిగజారుడు రాజకీయమన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి మోచేతికి బెల్లం పెట్టారన్నారు. రైతులను నానావస్థలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చెప్పులతో కొట్టే రోజు వచ్చిందన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నిధులు సమకూర్చిందో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## శానిటేషన్‌పై అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి: ఎమ్మెల్యే



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరవాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. నిరంతరం శానిటేషన్ పనులు కొనసాగించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదేశించారు. నగరంలోని 34వ డివిజన్‌లో మిర్చి కాంపౌండ్, మార్వాడి గల్లీ, ఓల్డ్ రమేష్ టాకీస్ రోడ్డు తదితర కాలనీల్లో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేవలం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నప్పుడు మాత్రమే కాకుండా.. నిరంతరం డ్రెయినేజీ పరిశుభ్రత, మంచినీటి సరఫరా, వీధి దీపాల పనులను పర్యవేక్షించాలని తెలిపారు. అవసరమున్న చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పలు గల్లీల్లో నీటి పైప్‌లైన్ లీకేజీలు గమనించి, వాటిని అరికట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా.. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలన్నారు. నిత్యం పర్యవేక్షణ చేస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట మేయర్ ఉమారాణి రమేష్, కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్, బీజేపీ నాయకులు పవన్ తదితరులు ఉన్నారు.

## ఐటీఐ వాకింగ్ అసోసియేషన్ కార్యవర్గం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఐటీఐ వాకింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం గ్రౌండ్‌లో వాకింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధ్యక్షుడిగా పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ గైక్వాడ్, కోశాధికారిగా శ్రీరామ్, గౌరవ అధ్యక్షుడిగా మురళీకృష్ణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. వాకింగ్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ పూర్తిస్థాయిలో పనిచేస్తుందని తెలిపారు. వాకింగ్ సభ్యుల ఆహ్లాదం కోసం 12ఏళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ సభ్యులతో మమేకమైనట్లు వారు పేర్కొన్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలియజేశారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో గాంధారి క్రీడాకారిణి ప్రతిభ



**అక్షరటుడే, గాంధారి:** కోల్‌కతాలో జరిగిన అండర్-14 వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో గాంధారి మండలం గురజాల క్రీడాకారిణి సాటిక ప్రసన్నలక్ష్మి ప్రతిభ చూపింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమెను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా తూర్పు రాజులు మాట్లాడుతూ ప్రసన్న మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చి కామారెడ్డి జిల్లాకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బి గణేష్, మోహన్ నాయక్, సయ్యద్ అహ్మద్, మహిళా నాయకురాలు వసుంధర దేవి, బాలు, నీల రవి, సంగం బాబా, జువ్వాడి సంతోష్, జువ్వాడి భూమేష్, వినయ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**తెలంగాణ యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, పార్ట్ టైం మహిళా సిబ్బందిపై కొందరు ప్రొఫెసర్లు అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. బాధ్యతాయుత పదవుల్లో ఉన్న ప్రొఫెసర్ల ప్రవర్తన వివాదాస్పదంగా మారుతోంది.**

**- అక్షరటుడే, తెయూ క్యాంపస్**




# తెయూలో మహిళా సిబ్బందిపై వేధింపులు

- హద్దులు మీరుతున్న కొందరు ప్రొఫెసర్ల ప్రవర్తన

యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో గత నెలలో జరిగిన ఘటన తాజాగా వెలుగులోకి రావడంతో మహిళ ఉద్యోగుల భద్రత, గౌరవంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలన పరమైన పదవిలో ఉన్న ఓ సీనియర్ ప్రొఫెసర్ గత నెలలో హెల్త్ సెంటర్‌కు వెళ్లి తన వేలుకు గాయమైందని టీటీ వేయాలని ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అడిగినట్లు సమాచారం. ఇంజక్షన్ ఇచ్చే సమయంలో ప్రొఫెసర్ అసభ్యకర మాటలతో అనుచితంగా వ్యవహరించడంతో ఆమె బయటకు పరుగెత్తుకోచ్చింది. ఆయన తీరుపై తోటి సిబ్బందితో చెప్పుకొని బోరున విలపించింది. పైస్థాయి అధికారి, అందులో సీనియర్ ప్రొఫెసర్ కావడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు బాధితురాలు భయపడింది.

### చర్యలు తీసుకోని రిజిస్ట్రార్

ప్రొఫెసర్ వ్యవహారంపై ఔట్ సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి ఫిర్యాదు చేశారు. ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఆయన రెగ్యులర్ ఉద్యోగి అని ఎలా సస్పెండ్ చేస్తామని రిజిస్ట్రార్ ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. సదరు ప్రొఫెసర్‌తో బాధిత మహిళకు క్షమాపణ చెప్పించి విషయం రాద్ధాంతం చేయవద్దని రిజిస్ట్రార్ హెచ్చరించినట్లు యూనియన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారు వీసీ యాదగిరి రావును కలిసి జరిగిన విషయాన్ని వివరించారు. ఈ అంశమై వీసీ యాదగిరిరావును 'అక్షరటుడే' ఫోన్లో సంప్రదించగా... మహిళా ఉద్యోగిపై ప్రొఫెసర్ అనుచితంగా వ్యవహరించిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. సదరు ప్రొఫెసర్‌ను తీవ్రంగా మందలించినట్లు చెప్పారు. విద్యార్థులు, పోకిరీలు తప్పు చేస్తే మందలించాల్సిన ప్రొఫెసర్ ఇలాంటి పని చేయడం సిగ్గు చేటన్నారు. యూనివర్సిటీలో ప్రొఫెసర్స్ ఎవరైనా వేధిస్తే తనకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

### అవుట్ సోర్సింగ్ సిబ్బందే టార్గెట్?


యూనివర్సిటీలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న మహిళ ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేకపోవడంతో తరచూ ఒత్తిడులకు గురవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శాశ్వత ఉద్యోగుల మాదిరిగా రక్షణ లేకపోవడం, కాంట్రాక్టు పునరుద్ధరణ భయం కారణంగా అనేక మంది తమకు ఎదురైన అవమానాలు, వేధింపుల గురించి బయటకు చెప్పడానికి వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది.

### ఉద్యోగం పోతుంది

కొన్ని సందర్భాల్లో ఉన్నత హోదాలో ఉన్న ప్రొఫెసర్లు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ మహిళా సిబ్బందిపై ఒత్తిడి తీసుకొస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనికి సంబంధం లేని వ్యక్తిగత వ్యాఖ్యలు, అసభ్యకర సందేశాలు, ఒంటరిగా కలవాలని ఒత్తిడి చేయడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని యూనియన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే ఉద్యోగం పోతుంది, పనిస్థలంలో ఇబ్బందులు పెరుగుతాయి, పేరు చెడిపోతుంది అనే భయాలతో చాలా మంది మహిళలు నోరు విప్పడం లేదని సమాచారం. ఇలాంటి చర్యలకు పాల్పడిన ప్రొఫెసర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఆర్టీఏ అధికారుల తనిఖీలు


**అక్షరటుడే, ఆర్మూర్:** జిల్లావ్యాప్తంగా ఆర్టీఏ అధికారులు బస్సుల తనిఖీలను ముమ్మరం చేశారు. ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తున్నారు. పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో స్కూల్ బస్సుల తనిఖీలు నిర్వహించారు. వాహనాల పత్రాలు, ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్సు లను పరిశీలించారు. వాహనాలకు తప్పనిసరి ఫిట్‌నెస్ చేయించుకోవాలని, మద్యం సేవించి వాహనాలను నడపకూడదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాలను సీజ్ చేసి మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ రోహిత్ రెడ్డి, సిబ్బంది మనోజ్ పాల్గొన్నారు.





## ఎస్‌హెచ్‌వో సతీశ్‌కు మాతృవియోగం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని నాల్గో టౌన్ ఎస్‌హెచ్‌వో సతీష్ తల్లి సాదుల రుక్మిణి బాయి సోమవారం రాత్రి మృతి చెందారు. అనారోగ్య కారణాలతో ఆమె మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. అంతిమ సంస్కారాలను స్వగ్రామైన రాంపూర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆమె మృతిపట్ల తోటి సిబ్బంది ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



## రెంజర్లలో భక్తిశ్రద్ధలతో దేవత విగ్రహప్రతిష్ఠాపన

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రామవ్వ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవత ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య భూమేశ్వర్, శాలివాహన సంఘం సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఏలు సర్వేలో చురుకుగా పాల్గొనాలి..



**అక్షరటుడే, ఇందూరు:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 'సర్' సర్వేలో సీపీఐ బీఎల్ఏలు చురుకుగా పాల్గొనాలని జిల్లా కార్యదర్శి సుధాకర్ సూచించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ, ఇతర రాజకీయ పార్టీల బీఎల్ఏలు సర్వేకొచ్చిన బీఎల్వోలకు సహకరిస్తూ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు రంజిత్ పాల్గొన్నారు.

## ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం




**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక ఒక ప్రకటన తెలిపారు. ఫస్టియర్‌లో బీఎస్సీలో (ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ) బీకాంలో (సీఏబీఏ), బీఏలో (హెచ్‌ఈపీ) కోర్సుల్లో ఎస్‌సీ సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్ సెకండియర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ధ్రువపత్రాలతో కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 98665 86887, 99596 31207, 80081 19072లను సంప్రదించాలని కోరారు.



## జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నమ్మించి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి మూడేళ్లయినా స్పందించకపోవడం సిగ్గుచేటని విద్యార్థి సేన ఆర్మూర్ డివిజన్ ఇన్‌ఛార్జి వికాస్ అన్నారు. పట్టణంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పోలీస్ శాఖలో 19వేలకు పైగా ఖాళీలు ఉన్నట్టు గుర్తించగా కేవలం 5వేల పోస్టులే భర్తీ చేస్తుండడం సరికాదన్నారు. 20వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు సాయి కిషోర్, అంజి పాల్గొన్నారు.





## క్యూలో చెప్పులు..అన్నదాత తిప్పలు..

**గాంధారి మండలంలోని నేరల్ తండాలో సొసైటీ వద్ద యూరియా బస్తాలు కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఎర్రటి ఎండలో నిలబడలేక తమ చెప్పులను క్యూలో ఉంచి తమ వంతు వచ్చేవరకు ఎదురుచూస్తున్నారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఏవో రాజలింగంను సంప్రదించగా యూరియా పుష్కలంగా ఉందన్నారు. యాప్‌లో కలిగే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – చిరంజీవి, అక్షరటుడే గాంధారి**

## రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన భిక్కనూరు రైల్వేస్టేషన్ శివారులో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి భిక్కనూరు రైల్వే స్టేషన్ కేఎం నంబర్ 531/1314 మధ్య రైల్వే ట్రాక్‌పై సుమారు 35 నుంచి 45 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతోనే గుర్తుతెలియని రైలు కింద పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు మృతుడి తల, ముఖం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టడం కష్టంగా మారిందన్నారు. మృతుడి ఎత్తు 5 అడుగుల 2 అంగుళాలు, నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు బెల్టు, నీలం రంగు బనియన్, నీలం రంగు చినిగిన టీ షర్టు కలిగి ఉన్నాడని, బ్రౌన్ కలర్ చెప్పులు వేసుకుని ఉన్నాడని తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లభించలేదన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ఉంటే కామారెడ్డి రైల్వే ఎస్సై సాధు లింబాద్రిని సెల్ నెంబర్ 8712658614లో సంప్రదించాలని కోరారు.

## యూరియా యాప్ రద్దు చేయాలని రాస్తారోకో



**అక్షరటుడే, మెండోరా:** యూరియా యాప్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్‌నాయకులు రాస్తారాకో చేశారు. మెండోరా మండలం పోచంపాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యూరియా పంపిణీకి అమలు చేస్తున్న యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే సహకార సంఘాల ద్వారా నేరుగా యూరియా అందించాలన్నారు. యాప్ విధానం కారణంగా స్మార్ట్‌ఫోన్ లేని మహిళా, వృద్ధ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యాప్ ద్వారా కాకుండా పాత విధానంలోనే యూరియాను సొసైటీలకు పంపిస్తే రైతులు నేరుగా డబ్బులు చెల్లించి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే యూరియా యాప్‌ను ఎత్తివేయాలని, లేకపోతే పెద్దఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మిస్బావద్దీన్, ఉప సర్పంచ్ సంపంగి సతీష్, మండల మార్కెట్ కమిటీ నాయకుడు నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ ఎల్కటూరు గంగారెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.